
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
శనివారం 4 జనవరి 2025

మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ ప్రోత్సాహం

జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రఘువరణ్

జగిత్యాలరూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి రఘువరణ్ అన్నారు. శుక్రవారం జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస, పొరండ్ల, లక్ష్మీపూర్ గ్రామాల్లో మహిళాసంఘాల సభ్యులు నిర్వహిస్తున్న పలురకాల యూనిట్లను పరిశీలించారు. మహిళలు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా ఏపీడీ చరణ్ దాసు, ఏపీఎం గంగాధర్, సీసీలు రవీందర్, మరియా, సమాఖ్య అధ్యక్షురాళ్లు సత్తవ్వ, వీఓఏలు రమ, సత్య, భాగ్య లక్ష్మీ, రాజ్యలక్ష్మీ, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో సంస్థాగతమెప్పుడో?



- గుర్తింపు కోసం కేడర్ ఆరాటం
- ఊరిస్తున్న పదవులు.. దక్కకపోవడంతో నిరాశ
- కేవలం అధ్యక్ష పదవికే పరిమితమైన జిల్లా కమిటీ
- కార్యవర్గం ఏర్పాటు..అనుబంధ కమిటీల కోసం తప్పని ఎదురుచూపులు
- స్థానిక సంస్థల ఎన్నికలు దగ్గరపడుతున్నా.. వీడని సందిగ్ధం

జగిత్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సంస్థాగతంగా కీలకంగా వ్యవహరించి ఎప్పటి కప్పుడు పదవుల భర్తీపై బీఆర్‌ఎస్ అధిష్టానం దృష్టి సారించడం లేదు.

గతంలో 2014కు ముందు పార్టీ సంస్థాగతంగా కీలకంగా వ్యవహరించి పదవులు కేటాయిస్తూ పర్యవేక్షిస్తూ ఉండేది. కేవలం ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ కాలం వెళ్లదీస్తుండడంతో కేడర్ నైరాశ్యంతో ఉంటోంది. ఏళ్ల తరబడి పార్టీ కమిటీల్లోనూ చోటు దక్కుతుందని భావించి నప్పటికీ నిరాశే ఎదురవుతోంది. పార్టీ రాష్ట్ర కమిటీ తో పాటు అనుబంధ కమిటీ లు వేస్తారా... వేయరా... ఇలాగే కాలం వెళ్లదీస్తారా... అనేది పార్టీలో జోరుగా చర్చ జరుగుతోంది పార్టీ పదవుల ఇస్తే పార్టీ చేపట్టే ప్రతి కార్యక్రమంలో చురుగ్గా పాల్గొనడంతో పాటు బలోపేతానికి తమ వంతు కృషిచేస్తామని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలో గతంలో బీఆర్‌ఎస్ పరిస్థితి..

జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, ధర్మపురి నియోజక వర్గాల్లో గత ప్రభుత్వ హయాంలో బీఆర్‌ఎస్ ప్రజా ప్రతినిధులు కీలకంగా వ్యవహరించారు. ధర్మపురి నియోజకవర్గం నుంచి గెలుపొందిన కొప్పుల ఈశ్వర్ గత ప్రభుత్వంలో మంత్రిగా వ్యవహరించారు. అదే విధంగా కోరుట్ల, జగిత్యాల నియోజక వర్గాల నుంచి సైతం బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, డాక్టర్ సంజయ్ కుమార్ గత ప్రభుత్వ హయాంలో బాధ్యతలు నిర్వర్తించారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ నేత ఎల్ రమణ వ్యవహరిస్తున్నారు. గత యేడాది క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ ఎస్‌కు ఆశించిన ఫలితాలు రాలేదు. ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గెలు పొందగా, కోరుట్ల, జగిత్యాల బీఆర్‌ఎస్ అభ్యర్థులుగా డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ పోటీ చేసి గెలుపొందారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పార్టీ మారారు. ప్రస్తుతం జిల్లాలో బీఆర్‌ఎస్ పునర్వైభవం కోసం ప్రయత్నాలు చేస్తోంది.

సంస్థాగతంగా బలోపేతంపై దృష్టి కరువు..

రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీ బీఆర్‌ఎస్ పార్టీ రెండు పార్యాయాలు అధికారంలో ఉంది. అయినప్పటికీ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయలేదని, ఆ దిశగా దృష్టి సారించలేదని పార్టీ నేతలు పలు సందర్భాల్లో అంటున్నారు.

(తరువాయి 8లో)

ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



సెయింట్ థెరిస్సా హై స్కూల్‌లో ఉపాధ్యాయులకు సన్మానం

జగిత్యాల అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని జగిత్యాలలో శుక్రవారం మహిళా ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్ జి. చంద్రయ్య, డాక్టర్ ప్రమోద్ కుమార్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ శ్రీలత, సుజాత, అధ్యాపక బృందం పాల్గొన్నారు. వాణి నగర్‌లోని సెయింట్ థెరిస్సా హై స్కూల్‌లో విద్యార్థులు మహిళా ఉపాధ్యాయులకు సన్మానం చేశారు. పట్టణంలో సీనియర్ సిటిజన్స్ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. బీఎస్పీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా ఇన్‌చార్జి చిర్ర శంకర్, బిరుదుల లక్ష్మణ్, బొల్లంపెల్లి సంపత్, దూమాల రాజ్ కుమార్ పాల్గొన్నారు.

- మహిళల విద్యకు ఆద్యురాలు సావిత్రిబాయి పూలే అని కలెక్టర్ బి.సత్యప్రసాద్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని సమీకృత కార్యాలయ సముదాయంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా ఉపాధ్యాయులను, ఎంఈవోలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, ఏవో హన్మంతరావు, డీఈవో రాము, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి రాజ్‌కుమార్ పాల్గొన్నారు. జగిత్యాల పట్టణంలోని బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమం లో బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీనారాయణ, రోజా, గంగాధర్, సురేష్, మల్లీశ్వరి, రవి, హృషికేష్ పాల్గొన్నారు.

ప్రకటన

ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా శ్రీమతి Maroju Lavanya w/o Santhosh, Aged 42, Occu: Household, R/o H.NO. 3-2-119, Puranipet. Jagtial Town & District, Telangana. 505327 garu

That the Property bearing H.No. 3-2-119, having Total extent. 130.84 Sq. Yards (or). 109.40 Sq.mtrs. The property Situatedat Puranipet. Jagitiall Town & Dist. with in the Jurisdiction ofReg. Sub-Dist. Jagtial, Reg. Dist: Karimnagar.

EAST: House of A.Bhoomaiah & House of A. Anjaiah, WEST : Road, NORTH : House of chakinala Shankaraiah SOUTH : House of Chetla Mahesh

ఈ దాని యజమాని అయి ఉండి సంపూర్ణ స్వాధీనము లో ఉండి నా క్లయింట్ మెస్సర్స్ శ్రీ రామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచి జగిత్యాల వారి వద్ద తనఖా పెట్టుట న్నారు. కావున ఎవరికయినా ఎలాంటి హక్కులు కానీ ఆక్షేపణలు కానీ ఉన్న యెడల ఈ ప్రకటన వెలువడిన (07) రోజుల లోపల ఈ క్రింది చిరునామాకు తెలియ జేయగలరు.

ఇట్లు సం/- పిన్నింటి అశోక్, అడ్వకేట్
3-7-852/1, వావిలాలపల్లి, కరీంనగర్.
సెల్ : 9849331558

ఏ పార్టీ కూడా రుణమాఫీ చేయాలని సంకల్పించలేదు

ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జీవన్ రెడ్డి

రాయికల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శాసనసభ ఎన్నికల సమయంలో ఏ రాజకీయ పార్టీ కూడా రుణమాఫీ చేయాలని సంకల్పించలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను అప్పుల ఊబిలో నుంచి బయటకు తీసుకురావాలని ఈ ఆలోచన చేసిందని ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2018 శాసన సభ ఎన్నికల్లోపల ఎన్నికల లబ్ధి పొందే ఆలోచనతోనే జీవోను పక్కనబెట్టి సాగుకు సంబంధం లేకుండా ఇస్తున్నామని, గుట్టలకు, పుట్టలకు లే అవుట్‌లు చేసి ఇళ్ల నిర్మాణం చేసిన స్థలాలకు రైతుబంధు ఇచ్చారన్నారు.

రైతుబంధు లక్ష్యం అనేది రైతులకు పెట్టుబడి రూపకంగా సహాయం చేయాలనే భావనతో రూపొందించా రన్నారు. గతంలో రైతులకు ఇచ్చే వ్యవసాయ పని ముట్లు, సీడ్స్ సబ్సిడీలు తొలగించి నగదు రూపాన రైతుకు పెట్టుబడి సమకూర్చాలని జీవో నం. 231 ద్వారా ఉత్తర్వులు జారీ చేసిందని, జీవో ప్రకారం సాగు భూమికి మాత్రమే రైతుబంధు నిధులు ఇవ్వాల్సి ఉండగా, కేవలం ఎన్నికల కోసం అప్పటి ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు ఇవ్వడంతో జీవోకు భిన్నంగా అప్పటి కలెక్టర్‌లు, వ్యవసాయ శాఖ అధికారులు సాగులో లేని భూములకు కూడా రైతుబంధు ఇచ్చారన్నారు. ఆ అధికారులను ప్రాసిక్యూట్ చేయాలన్నారు.

ఎన్నికలు రావడంతో రూ.4 వేల నుంచి రూ.5 వేలకు పెంచడం, సాగుకు సంబంధం లేకుండా ఉన్న భూమికి పెట్టుబడి సహాయం అందించారని పేర్కొన్నారు. ప్రభుత్వ నిధులు ఏవైనా అర్హతకు అనుగు ణంగా, సక్రమంగా వినియోగపడాలని అన్నారు. రైతు భరోసానే కేబినేట్‌లో చర్చ జరుగుతుందని, ఎలాంటి ఆంక్షలు లేకుండా సాగు చేసే భూమికి మాత్రమే రైతు భరోసా ఇచ్చే విధంగా చూస్తామన్నారు. రాయికల్ మండలంలోని జగన్నాథ్‌పూర్ వంతెన గురించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని, శాఖాపరంగా నివేదిక తెప్పించుకుని ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ముందు కేవలం వంతెన కోసం అంచనా వేస్తే రూ.12.20 కోట్లు వచ్చిందన్నారు. అప్రోచ్ రోడ్డు కూడా కలిపితే మరో రూ.5 కోట్లు మొత్తం రూ.17.5 కోట్లకు ప్రభుత్వానికి 2024-25 బడ్జెట్‌లో ప్రతిపాదన తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో బోర్నపెల్లి-జగన్నాథ్‌పూర్ వంతెనకు మంజూరు వస్తుందన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోదావరిలోకి నీరు విడుదల చేయండి

మంత్రి ఉత్తమ్‌కు విప్ అడ్లూరి వినతి



మంత్రి ఉత్తమ్ కుమార్‌కు వినతి పత్రం అందిస్తున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్

ధర్మపురి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని కొన్ని గ్రామాలు గోదావరి ఎత్తిపోతల పథకాలపై ఆధారపడి వ్యవసాయం చేస్తుండగా నీరు లేక సాగుకు ఇబ్బంది కలుగుతుందని, వెంటనే ఒక టీఎంసీ నీటిని గోదావరిలోకి వదలాలని కోరుతూ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హైదరాబాద్‌లో రాష్ట్ర ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వినతి పత్రం అందించారు. మండలంలోని దొంతాపూర్, జైనా, రాజారం, దమ్మన్నపేట గ్రామాలకు చెందిన రైతులు గోదావరి ఎత్తిపోతల పథకాలు, గోదావరి నదికి విద్యుత్ మోటార్లు అమర్చి వేలాది ఎకరాల పంట పొలాలు సాగు చేస్తున్నట్లు ఆయన మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం గోదావరి నదిలో నీరు లేకపోవడం వల్ల పంట పొలాలు సాగుకు నోచుకోవడం కష్టంగా మారిందని ఆయన తెలిపారు. ప్రస్తుత పరిస్థితుల కారణంగా వెంటనే గోదావరి నదిలోకి ఎస్సారెస్పీ నుంచి ఒక టీఎంసీ నీరు విడుదల చేయించి రైతులను ఆదుకోవాలని మంత్రికి ఆయన విజ్ఞప్తి చేశారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, THALLAPALLI MANJULA W/O. THALLAPALLI SADANANDAM, R/O. H.NO. 8-5-553/D/2/A/1, POCHAMMAWADA, KOTHIRAMPUR, KARIMNAGAR, CHANGED MY NAME AS "SURABHI MANJULA" W/O. THALLAPALLI SADANANDAM

AJK-218298

CHANGE OF NAME

★ I, MOHAMMED AHMED RASHEEDUDDIN, S/O. MOHAMMED AMEEN UDDIN, R/O. H.NO. 6-2-296, HUSSAINIPURA, KARIMNAGAR. HAVE CHANGED MY NAME AS "MOHD RASHEEDUDDIN AHMED " S/O. " MOHD AMEENUDDIN "

AJK-16354

కావలెను

★ మంచిర్యాల లోని మహేష్ గ్రాఫిక్స్‌లో పనిచేయుటకు అనుభవం గల "Photshop / Coroldraw" డిజైనర్స్ మరియు ఫ్లెక్స్ ప్రింటర్ ఆపరేటర్స్ వెంటనే కావలెను. సంప్ర : 99481 59999

AJK-218370

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.

పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 9703618691, 9985410640
జగిత్యాల :- సెల్ : 99854 11262
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238

వృద్ధుల సమస్యల పరిష్కారంలో ముందంజ

అదనపు కలెక్టర్ లత

జగిత్యాల అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వృద్ధుల సమస్యల పరిష్కారంలో జిల్లా ముందంజలో ఉందని జిల్లా అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. శుక్రవారం తెలంగాణ సీనియర్ సిటిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వృద్ధుల సంరక్షణ చట్టం పిలుపు పత్రికను ఆమె ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్ సమాజ మార్గదర్శకులని, తల్లిదండ్రులను విస్మరిస్తే ఎంత టివారికైనా చట్టపరమైన చర్యలు తప్పవని అన్నారు. వయోవృద్ధుల కోసం జగిత్యాల జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆమె అభినందించారు. వృద్ధుల సమస్యల పరిష్కా రంలో జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవో లు సత్వర పరిష్కారం కోసం చేస్తున్న కృషిని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, హన్మంతరెడ్డి, ఎండీ యాకూబ్, వెలుముల ప్రకాష్‌రావు, విజయ్, అశోక్‌రావు, దిండి గాల విఠల్ పాల్గొన్నారు.

డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

జిల్లా పౌరసరఫరా అధికారి జితేందర్ రెడ్డి

జగిత్యాల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని జిల్లా పౌరసరఫరా అధికారి జితేందర్ రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లో నిల్వ ఉన్న బియ్యం నిల్వలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. లబ్ధిదారులకు సక్రమంగా సరుకులు పంపిణీ చేయాలని ఆదేశించారు. రేషన్ డీలర్లు సమయపాలన పాటించాలని, ధరల పట్టిక ప్రదర్శించాలని సూచించారు. కార్డు దారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫోర్టిఫైడ్ రైస్ గురించి కార్డు దారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు సివిల్ సప్లయి శాఖ, రెవెన్యూ శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.







కొండగట్టు అంజన్న ఈవో బదిలీ

● వేములవాడ ఈవో వినోద్‌కు అదనపు బాధ్యతలు



రామకృష్ణరావును సత్కరిస్తున్న దేవస్థానం సిబ్బంది

మల్యాల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ఈవో ఎం.రామ కృష్ణరావు బదిలీ అయ్యారు. సికింద్రాబాద్ లోని గణేశ్ టెంపుల్ ఈవోగా బదిలీ చేస్తూ దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ కె.జ్యోతి ఉత్తర్వులు జారీ చేశారు. దేవాదాయశాఖలో ఆర్ జేసీగా కూడా అదనపు బాధ్యతలు చూస్తున్న రామకృష్ణారావుకు ఇటీవల దేవాదాయశాఖ తరుపున ప్రభుత్వ కార్యక్రమాలకు హాజరు అవడం, కొండగట్టు దూరం కావడంతో బదిలీ చేసినట్లు తెలుస్తోంది. రామకృష్ణారావు కొండగట్టులో ఈవోగా ఆగస్టు 1న బాధ్యతలు చేపట్టి కేవలం అయిదు నెలలు మాత్రమే విధులు నిర్వహించారు. ఈ కాలంలో దేవస్థానం పరిధిలో అభివృద్ధి, పాలనలో, సిబ్బంది విధుల నిర్వహణలో పారదర్శకతకు కృషి చేశారు. రామకృష్ణారావు స్థానంలో కొండగట్టుకు వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం ఈవో కె.వినోద్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు.

● బదిలీ అయిన ఈవో రామకృష్ణారావు శుక్రవారం దేవస్థానం అధికారులు, సిబ్బంది, అర్చకులు సత్కరించారు. అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించిన అనంతరం సత్కరించారు. ఆయన అం దించిన సేవలను కొనియాడుతూ అభినందించారు. ఈ కార్యక్రమంలో మేజర్ టెంపుల్స్ జేఏసీ నాయకుడు ఉపాధ్యాయుల చంద్రశేఖర్, పర్యవేక్షకులు హరిహరనాథ్, అశోక్, రాములు ప్రధానర్చ కులు రామకృష్ణారావు, అర్చకులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం కూల్చివేత



భవనం పక్కనున్న బాత్‌రూం గోడను కూల్చుతున్న రెవెన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బంది

కరీంనగర్ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ మండలం బొమ్మకల్ గ్రామంలో సర్వే నంబర్ 765లోని ప్రభుత్వ భూమిలో నిర్మించిన అక్రమ కట్టడానిన రెవెన్యూ, గ్రామ పంచాయతీ సిబ్బంది శుక్రవారం తొలగించారు. గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం ఆర్డీవో మహేశ్వర్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టారు. ఇందులో బాగంగా 628 సర్వే నంబర్‌లో హద్దులను ఏర్పాటు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. కాగా 765 సర్వే నంబర్‌లో స్థానికుల ఫిర్యాదు మేరకు సర్వేయర్ సంతోష్, ఆర్ఐ వాస్తవిక్, పంచాయతీ కార్యదర్శి హిదైతుల్లా మోఖాపై వెళ్లి పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మించిన బాత్రూం గోడను కూల్చివేశారు. సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో విచారణ చేసి ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ స్థలాలను కాపాడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్ పట్టివేత

● రెండు మొరం ట్రాక్టర్లు, జేసీబీ సీజ్

మెట్‌పల్లిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న ఒక ఇసుక టిప్పర్‌ను, రెండు మొరం ట్రాక్టర్లను పట్టుకున్నట్లు మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గురువారం పట్టణంలోని పాత బస్టాండ్ వద్ద రాత్రి సమయంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది తనిఖీలు నిర్వహిస్తుండగా అక్రమంగా తరలిస్తున్న ఇసుక టిప్పర్‌ను, మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌లకు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మెట్‌పల్లి మం డలం ఆత్మనగర్ వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలించడానికి వినియోగిస్తున్న జేసీ బీని పట్టుకున్నట్లు తెలిపారు. యజమానిపై ఎస్ఐ కిరణ్ కుమార్ కేసు నమోదు చేసినట్లు తెలిపారు.



రేకుర్తిలోని అంధుల పాఠశాల

చీకటి జీవితాల్లో వెలుగుబాట

కంప్యూటర్ నేర్చుకుంటున్న అంధ విద్యార్థులు

● కరీంనగర్‌లో 82 మందితో అంధుల పాఠశాల

● విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేలా ప్రత్యేక బోధన

● నేడు బ్రెయిలీ లిపి సృష్టికర్త లూయిస్ జయంతి

భగత్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): చూపులేనిదే ప్రపంచం చీకటిమయం... అంధుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ బ్రెయిలీ ఎంతో కృషి చేశారు. ఆయన రూపొందించిన లిపి ద్వారా అంధులు నేడు ప్రపంచాన్ని వీక్షించ గలుగుతున్నారు. ఆ బాటలోనే కరీంనగర్‌లో ఏర్పాటు చేసిన అంధుల పాఠశాల వారు జీవితంలో ఎదిగేలా తోడ్పాటును అందిస్తోంది. బ్రెయిలీ లిపి సృష్టకర్త లూయిస్‌బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం..

లూయిస్ బ్రెయిలీ అంధుల కోసం జీవితాన్ని అర్పించిన మహానుభావుడు. అంధుల సేవలకు ప్రతిక, అంధులు చదువుకునేందుకు వీలుగా బ్రెయిలీ లిపిని అవిష్కరించి విప్లవాత్మకమార్పులకు బ్రెయిలీ స్వీకారం చుట్టారు. 1809 జనవరి 4వ తేదీన ఫ్రాన్స్‌లోని కూప్రే గ్రామంలో సామాన్య కుటుంబంలో జన్మించిన లూయిస్ మూడు సంత్సరాల వయస్సులో ప్రమాదంలో కంటిచూపును కోల్పోయారు. రాయల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్‌బ్లైండ్‌యూత్‌లో చేరి విద్యాభ్యాసం కొనసాగించి అంధులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బ్రెయిలీ లిపిని 1824 సంవత్సరంలో అవిష్కరించారు. ప్రత్యేకమైన అక్షరమాలతో అక్షరాలు, అంకెలు, ఇతర చిహ్నాలు అందించి అంధులకు తాము చదువగలం, రాయగలం అనే స్వేచ్ఛను ప్రసాదించారు. బ్రెయిలీ లిపి ద్వారా సంగీత నోటేషన్లు, గణిత సూచనలు, శాస్త్రీయ సమాచారాన్ని అంధులు నేర్చుకుంటున్నారు. విద్యావ్యవస్థలో బ్రెయిలీలిపి వారి ఆలోచనలను వ్యక్తపరచడానికి దోహదం చేసింది.

● కరీంనగర్‌లో అంధుల పాఠశాల

కరీంనగర్ జిల్లా కేంద్రంలో 1981లోనే అంధుల పాఠశాలను నెలకొల్పి ఈ ప్రాంత అంధ విద్యార్థులకు విద్యాభ్యాసం చేయిస్తున్నారు. 1996 సంవత్స రంలో పూర్తి స్థాయిలో ప్రత్యేకమైన రెసిడెన్షియల్ పాఠశాలగా మార్పుచెంది. ఆ తర్వాత రేకుర్తిలో 2013 సంవత్సరంలో సొంత భవనాన్ని సమకూర్చి అంధ విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నారు. ఈ పాఠశాలలో 82 మంది విద్యార్థులకు 1వ తరగతి నుండి 10వతరగతి వరకు విద్యాభ్యాసం చేస్తన్నారు. వీరి చదువుకు ఆటంకం రాకుండా ప్రభుత్వం అన్ని వసతులు కల్పించింది.

విద్యార్థులే ప్రపంచం



కరీంనగర్ అంధుల పాఠ శాలలో 82మంది విద్యార్థు లకు 32మంది బాలికలు, 50మంది బాలురు విద్యా భ్యాసం చేస్తున్నారు. విద్యా ర్థులే ప్రపంచంగా వారికి ఏలోటు రాకుండా మాములుగానే విద్యా బోధన చేస్తున్నాం. విద్యార్థులు చురుకుగా ఉంటూ అన్ని విషయాలపై ఆసక్తి చూపిస్తుంటారు. సాధారణ విద్యార్థుల మాదిరిగానే విద్యను కొనసాగిస్తున్నారు.

- బాస నర్మద, పాఠశాల ప్రిన్సిపాల్

● ఉన్నత చదువే లక్ష్యం



ఉన్నత చదువే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. ఉపాధ్యాయులు బోధించిన అంశాలపై పట్టు సాధించి ముందుకు వెళ్తున్నాం. సంగీతం పై పట్టు సాధించడంతో పాటు, కంప్యూటర్ విషయ పరి జ్ఞానాన్ని సొంతం చేసుకుంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించడమే లక్ష్యంగా చదువుకుంటున్నాం.

- కళ్యాణం తిరుమల, 8వ తరగతి

అంధులకు ప్రపంచాన్ని చూపిన మహాత్ముడు



బ్రెయిలీ లిపి చదువుతున్న అంధుడు

జగిత్యాల అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): చూపు లేక ప్రపంచాన్ని చూడలేని అంధులకు ఆరు చుక్కల భాషలో ప్రపంచాన్ని చూపిన మహాత్ముడు లూయిస్ బ్రెయిలీ. నేడు అనేక మంది అంధులు ఉద్యోగాలు చేస్తూ తమ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారంటే దానికి బ్రెయిలీ రూపొందించిన లిపి కారణం

దారి చూపిన మహానుభావుడు



లూయిస్ బ్రెయిలీ తయారు చేసిన బ్రెయిలీ లిపి నేడు నాతో పాటు అనేక మంది అంధులకు దారి చూపింది. కంటి చూపు లేకపోయినా చదువుకుని ఈరోజు ఉద్యోగం చేస్తూ విధులు సక్రమంగా నిర్వహిస్తున్నామంటే దానికి ఆ మహానుభావుడే కారణం. రెండు శతాబ్దాలు దాటినప్పటికీ ఆయన ఇచ్చిన ఈ ఆధారంతో ప్రపంచంలోనే అనేకమంది అందువులు చదువుకోవడంతో పాటు ఉన్నత స్థాయి ఉద్యోగాలు కూడా చేస్తున్నారు.

- గందారపు రాజు, జూనియర్ అసిస్టెంట్, కమర్షియల్ ట్యాక్స్ ఆఫీస్

ఆయనను స్మరించుకోవడం అదృష్టంగా భావిస్తున్నా



అంధకారంతో సాగుతున్న బతుకులకు దారి చూపిన మహానుభావుడు లూయిస్‌బ్రెయిలీ. ఆ యన జన్మదినం సందర్భంగా ఆయనను స్మరిం చుకోవడం అదృష్టంగా భావిస్తున్నాను. ప్రపం చంలోనే కోట్లాది మంది అంధులకు నాడు దారి చూపి ఈరోజు ఉన్నత స్థాయిలో ఉండటానికి కారణమైన లూయిస్ బ్రెయిలీని మరిచి పోము.

- బాల శంకర్, జూనియర్ అసిస్టెంట్, ఇరిగేషన్

అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు

● మెట్‌పల్లి అటవీ రేంజర్ అధికారి షౌకత్‌అలీ

మెట్‌పల్లిరూరల్, జనవరి, 3(ఆంధ్రజ్యోతి) : అటవీ భూములను ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి అటవీ రేంజర్ అధికారి షౌకత్‌అలీ హెచ్చరించారు. మండలంలోని రంగారావుపేట బీట్ కంపార్ట్‌మెంట్ పరిధిలో ఉన్న పాటిమీదితండా గ్రామ శివారులో అటవీ భూమిని చదును చేస్తూ కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేసినట్లు వచ్చిన సమాచారంతో ట్రాన్స్‌కో మెట్‌పల్లి ఏడీఈ మనోహర్‌తో కలిసి సందర్శించారు. అటవీ భూమిలో ఏర్పాటు చేసిన కరెంట్ స్తంభాలు, విద్యుత్ తీగలను తొలగించారు. అటవీ భూమిలో కరెంట్ స్తంభాలు ఏర్పాటు వారిని విచారించారు. అనంతరం ఆత్మకూర్ గ్రామంలో చుట్టుఉన్న గ్రామస్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఆత్మకూర్, రంగరావుపేట, పాటిమీదతండా గ్రామాల్లో సుమారు వందల ఎకరాల అటవీ భూమిని చదును చేసి ఆక్రమిస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతాన్ని కబ్జా చేసి వ్యవసాయ భూములుగా మార్చడంతో అడవీ జంతువులు, చిరుతపులి సంచరిస్తుందని, అటవీ భూములు, చెట్లను కాపాడేందుకు గ్రామాల మధ్య సరిహద్దులను ఏర్పాటు చేయాలని ప్రజలు అధికారులను కోరారు. ఈ సందర్భంగా రేంజర్ మాట్లాడుతూ అటవీ ప్రాంతంలోకి చొరబడి అక్రమంగా భూముల కబ్జాలకు పాల్పడేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తిరిగి వాటిని స్వాధీనం చేసుకునేందుకు దృష్టి సారిస్తామన్నారు. అటవీ భూమి సర్వే చేసేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు కిరణ్‌కుమార్, అనిల్, రాజు, అటవీ సెక్షన్ అధికారులు చైతన్యశ్రీ, అరుణ్‌కుమార్, బీట్ అధికారులు సత్తార్, శివరాజ్, అధికారులు, సిబ్బంది, గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



పాటిమీదితండాలో కబ్జాకు గురైన అటవీభూమిని పరిశీలిస్తున్న అధికారులు

ఆసుపత్రిలో యువకుడి మృతి

● బంధువుల ఆందోళన



శ్రావణ్(ఫైల్)

పెద్దపల్లిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో శుక్రవారం యువకుడి మృతిపై బంధువులు ఆందోళనకు దిగారు. కమాన్‌పూర్ మండలం పేరపల్లికి చెందిన అమృత, శ్రీనివాస్ దంపతుల కుమారుడు ఆకుల శ్రావణ్ (26) గురువారం జ్వరంతో బాధపడుతూ సదరు ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చాడు. డాక్టర్ పరీక్షలు చేసి ప్లేట్‌లెట్స్ తక్కువగా ఉన్నాయంటూ జాయిన్ చేసుకున్నాడు. అర్ధరాత్రి దాటిన తరువాత శ్రావణ్ మృతి చెందాడు. డాక్టర్ నిర్లక్ష్యం వల్లే చనిపోయాడని, హెవీడోస్ ఇచ్చాడని కుటుంబ సభ్యులు, గ్రామస్థులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. కుటుంబ సభ్యులతో డాక్టర్ చర్చలు జరపడంతో ఆందోళన విరమించి అంబులెన్స్‌లో మృతదేహాన్ని పేరపల్లికి తరలించారు. మృతుడికి ఇంకా పెళ్లి కాలేదు. ఈ ఘటనపై పోలీసులకు ఏలాంటి ఫిర్యాదు అందలేదు.

ప్రమాదవశాత్తు నేతకార్మికుడి మృతి

సిరిసిల్ల క్రైం, జనవరి 3(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణంలోని పద్మనగర్‌లో కళ్యాడపు సుభాష్(63) అనే నేత కార్మికుడు ప్రమాదవశాత్తు శుక్రవారం తెల్లవారుజామున మురికికాలువలో పడి మృతి చెందాడు. స్థానికుల వివరాల ప్రకారం... బెల్లంపల్లిలోని రడగపాల బస్తీకి చెందిన సుభాష్ కొంతకాలం క్రితం సిరిసిల్లకు వలసవచ్చి పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తు జీవనం సాగిస్తున్నాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. కుమారులందరూ హైదరాబాద్‌లో ఉండగా భార్య బెల్లంపల్లిలో ఉంటోంది. సుభాష్ ఒక్కడే సిరిసిల్లకు వచ్చి పవర్‌లూం కార్మికుడిగా పనిచేస్తున్నాడు. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు మురికికాలువలో పడి మృతిచెందాడు. శుక్రవారం ఉదయం మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సుభాష్ కుటుంబసభ్యుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కృష్ణ తెలిపారు.

ఎన్టీపీసీ సోలార్ ప్లాంట్‌లో అగ్నిప్రమాదం

జ్యోతినగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : రాజీవ్ రహదారి పక్కన ఉన్న ఎన్టీపీసీకి చెందిన పది మెగా వాట్ల సోలార్ ప్లాంట్‌లో శుక్రవారం అగ్ని ప్రమాదం జరిగింది. ప్లాంటులోని ఇన్వర్టర్ గదిలో బ్యాటరీ పేలడంతో మంటలు లేచాయి. వెంటనే ఫైర్ స్టేషన్‌కు సమాచారం ఇచ్చారు. సీఐఎస్ఎఫ్‌కు చెందిన అగ్నిమాపక విభాగం సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. అగ్ని ప్రమాదం వల్ల సోలార్ ప్లాంట్‌లో విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు.. కేసు నమోదు

సిరిసిల్ల క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వాట్సప్ గ్రూపుల్లో ఒక వర్గానికి చెందిన వారిని కించపరిచి ప్రజల మధ్య రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టిన సిరిసిల్ల పట్టణ బీజేపీ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌పై శుక్రవారం కేసు నమోదుచేశామని టౌన్ సీఐ కృష్ణ తెలిపారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు మాను కోవాలని గ్రూపులలో అనవసర మెస్సేజ్‌లను పోస్ట్ చేయరాదని పేర్కొన్నారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టినా, ఎవరో పెట్టిన పోస్టులను ఫార్వర్డ్ చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

భూ కబ్జా కేసులో నిందితుడి కస్టడీ

కరీంనగర్ క్రైమ్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తప్పుడు పత్రాలు సృష్టించి రేకుర్తిలోని సర్వే నంబర్ 74లో ఎకరం భూమి ఆక్రమించిన భూ ఆక్రమణదారు అబ్దుల్ అజీజ్‌ను కొత్తపల్లి పోలీసులు శుక్రవారం కస్టడీకి తీసుకున్నారు. నకిలీ ధ్రువపత్రాలు సృష్టించడమే కాక, బాధితుడి భూమి ఆక్రమణకు పాల్పడ్డ అబ్దుల్ అజీజ్‌ను గత నెల 26వ తేదీన అరెస్టు చేసి రిమాండుకు తరలించిన విషయం విదితమే. ఈ కేసుకు సంబంధించిన మరింత సమాచారం సేకరించేందుకు విచారణ కోసం కోర్టు ద్వారా 24గంటల పోలీసు కస్టడీకి తీసుకున్నామని కొత్తపల్లి ఎస్సై సాంబమూర్తి తెలిపారు. కస్టడీలోకి తీసుకున్న అబ్దుల్ అజీజ్ నుంచి మరింత విలువైన సమాచారం సేకరించేందుకు అతని ఇంటిలో సోదాలు నిర్వహించిన కొత్తపల్లి పోలీసులు పలు కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

కరీంనగర్ రూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ గురుకులాల్లో ఐదోతరగతి ప్రవేశపరీక్షల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కరీంనగర్ మండలం నగునూర్ గ్రామంలోని గురుకుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మాలతి శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. ప్రస్తుతం నాలుగోతరగతి చదువుచున్న విద్యార్థిని, విద్యార్థులు దరఖాస్తు చేసుకో వాలన్నారు. ఇందుకోసం కులం సర్టిఫికెట్, ఆదాయ ధ్రువీకరణ పత్రం, బర్త్‌సర్టిఫికేట్, ఫొటోలు, సంతకం, ఆధార్ కార్డు, నాలుగోతరగతి బోనఫైడ్ సర్టిఫికెట్‌తో ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని తెలిపారు. ఫిబ్రవరి1వ తేదీ వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, టీజీసీఈటీ. సీజీజీ.జీవోవీ.ఇన్‌లో అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్గటూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్తంభంపల్లి గ్రామానికి చెందిన బాలాస్తి గంగాధర్ (43)అనే వ్యక్తి చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గంగాధర్ కొన్ని రోజులుగా దృష్టి లోపంతో బాధపడుతున్నాడు. తన సొంత పనులు కూడా చేసుకోలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో మనో వేదనకు గురైన గంగాధర్ జీవితంపై విరక్తి చెంది ఈ నెల 1న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబీకులు జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్ లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించి చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందారు. గంగాధర్ తండ్రి భీమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు ప్రారంభించారు.

నగరంలో కోతుల బెడద



● విద్యార్థులపైకి వచ్చిన వానరాల గుంపు

● భయంతో భవనం పైనుంచి దూకిన దన్గర్‌వాడి విద్యార్థి, తీవ్రగాయాలు

● కోతుల బెడదను నియంత్రించేందుకు చర్యలు-కమిషనర్



ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న విద్యార్థి

కరీంనగర్ క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): నగరంలో కొతుల బెడద రోజురోజుకు తీవ్రమవుతున్నది. కోతులు గుంపులుగుంపులుగా ఇళ్లలోకి, పాఠశాలలు, దుకాణాల్లోకి చొరబడుతున్నాయి. కరీంనగర్ జ్యోతినగర్‌లోని ప్రభుత్వ దన్గర్‌వాడి హైస్కూల్‌లో గురువారం మధ్యాహ్నం కోతుల గుంపు విద్యార్థులపైకి రావటంతో ఒక్కసారిగా చెల్లాచెదురుగా పరిగెత్తారు. ఈ సందర్భంలో ఎనిమిదోతరగతి విద్యార్థి(14) భయంతో పాఠశాల భవనం మొదటి అంతస్థు నుంచి కిందకు దూకగా అతని రెండు కాళ్ల విరిగిపోవటమే కాకుండా నడుం భాగంలో తీవ్రగాయాలయ్యాయి. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తీవ్రంగా గాయపడిన విద్యార్థిని పాఠశాల ఉపాధ్యాయులు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం వరంగల్ ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. దన్గర్‌వాడి ప్రభుత్వ హైస్కూల్‌లో చాలాకాలంగా కోతుల బెడదతోపాటు కుక్కల బెడద కూడా ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమోద తెలిపారు. కోతుల గుంపు దాడితో విద్యార్థికి తీవ్రగాయాలైన సంఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారికి రాతపూర్వ కంగా సమాచారం అందిచామని ఆమె తెలిపారు.

కోతుల తరలింపునకు ఖరారుకాని టెండర్...

గతంలో కోతుల బెడదపై మున్సిపల్ కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదుచేస్తే కొద్దిరోజులు కోతులను పట్టుకుని దూరప్రాంతానికి, అటవీ ప్రాంతానికి తీసుకువెళ్లి వదిలిపెట్టారు. నగరంలోని కోతుల బెడదను నియంత్రించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేందుకు ఆరు నెలల కిందట టెండర్లు పిలిచి నేటికీ ఖరారు చేయలేదని కార్పొరేటర్ పెద్దపల్లి జితేందర్ వాపోయాడు. తాను కూడా పలుమార్లు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నాడు. రోజురోజుకు కోతుల బెడద తీవ్రమవుతుందని డివిజన్ ప్రజలు తన దృష్టికి తీసుకువస్తున్నారని అన్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకుని వెంటనే టెండర్‌ను ఖరారు చేసి కోతుల తరలింపు చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ జితేందర్ డిమాండ్ చేస్తున్నారు.

పాఠశాలలకు కొండముచ్చుల పంపిణీ

కరీంనగర్‌లోని దన్గర్‌వాడి ప్రభుత్వ స్కూల్‌లో కోతుల గుంపు భయంతో భవనంపై నుంచి దూకిన విద్యార్థికి తీవ్రగాయాలైన ఘటనపై మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. నగరంలోని ప్రతీపాఠశాలలో కోతుల బెడదను నియంత్రించేందుకు కొండముచ్చులను పంపిణీ చేస్తామని ప్రకటించారు. కోతుల బెడద తీవ్రంగా ఉన్న కాలనీలు, డివిజన్లలో కోతులను పట్టుకుని అడవిలో వదిలిపెడుతూ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. కోతులను పట్టుకునేందుకు టెండర్లు పిలిచేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. కోతులకు తినుబండారాలు, ఇతర ఆహారం అలవాటు చేయవద్దని మున్సిపల్ కమిషనర్ సూచించారు.

- మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

ఎస్‌యూ డిగ్రీ పరీక్షల్లో పదిమంది విద్యార్థులు డీబార్

గణేశ్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహిస్తున్న డిగ్రీ మూడో, ఐదో సెమిస్టర్ పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డ పదిమంది విద్యార్థులను శుక్రవారం డీబార్ చేసినట్లు శాతవాహన విశ్వవిద్యాలయం పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ ఎన్వి శ్రీరంగ ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. కరీంనగర్‌లోని అపూర్వ డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శివాని డిగ్రీ కళాశాలలో ఇద్దరు, శ్రీచైతన్య డిగ్రీ కళాశాలలో ఒకరు, పెద్దపల్లిలోని డిగ్రీ కళాశాలలో ఒకరు, ప్రభుత్వం డిగ్రీ కళాశాలలో ఒకరు, కరీంనగర్‌లోని కిమ్స్ డిగ్రీ కళాశాలలో ముగ్గురు విద్యార్థులు డీబార్ అయినట్లు తెలిపారు.

నేషనల్ హైవే పనులను అడ్డుకున్న రైతులు

ముత్తారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ హైవే పనులను శుక్రవారం రైతులు అడ్డుకున్నారు. సంబంధిత గుత్తేదారులు ఇష్టారీతిలో చేస్తున్నారని, గతంలో ఇచ్చిన మ్యాపు ఒకచోట ఉండగా.. పనులు మరొకచోట చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని పోతారం, మైదంబండ గ్రామాల్లో పనులను శుక్రవారం రైతులు అడ్డుకోగా తహసీల్దార్ సుమన్, ఎస్సై నరేష్‌లు వచ్చి రైతులతో మాట్లాడారు. సర్వేయర్‌ను పిలిపించి మ్యాపులో ఉన్నచోట పోలీసుల ఆధ్వర్యంలో ట్రెంచ్ చేయించారు. భవానీప్రసాద్, రాజబాబు, శ్రీధర్ పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్

బీసీలపై గతంలో లేని ప్రేమ ఇప్పుడు ఎందుకు?

- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు


మాట్లాడుతున్న గోనె ప్రకాశ్‌రావు

సుభాష్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ కవితకు బీసీలపై గతంలో ఎన్నడూ లేని ప్రేమ ఇప్పుడు ఎందుకు పుట్టుకు వచ్చిందని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్ రావు ప్రశ్నించారు. శుక్రవారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఎంతమంది బీసీలకు ప్రాధాన్యం ఇచ్చారని అన్నారు. ఎంత బీసీ, ఎస్సీ, ఎస్టీలకు కేబినెట్‌లో స్థానం కల్పించారని ప్రశ్నించారు. మొదటి సారి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినపుడు కేబినెట్‌లో అసలు మహిళలే లేరని అన్నారు. బీసీలపై కవిత మాట్లాడడం దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందన్నారు. అలాంటి వారు సావిత్రిబాయి పూలే జయంతి రోజు ధర్నా చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. జైలుకు వెళ్లిన వారంతా ముఖ్యమంత్రులు అవుతారన్న ఆశతో కవిత కూడా తన ప్రయత్నాలు మొదలుపెట్టిందన్నారు. అయితే తన అన్ననే తనకు పోటీగా వస్తున్నాడనే సమాచారం తనకు ఉందన్నారు. అసెంబ్లీలో బీసీ ఎమ్మెల్యేలు, శాసన మండలిలో బీసీ ఎమ్మెల్సీలు బీసీ అంశంపై ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. రేవంత్‌రెడ్డి సర్కార్‌కు అప్పులు వారసత్వంగా ఇచ్చిన బీఆర్‌ఎస్ నేతలు కొద్ది రోజులు పనిచేసే సమయాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలన్నారు. మెట్రో సేవలను షామీర్‌పేట వరకు పొడగించడం అభినందనీయమని అన్నారు. మంచిర్యాల నుంచి బసంత్‌నగర్‌కు నేరుగా రోడ్డు నిర్మాణం చేయడం వల్ల కరీంనగర్‌కు రావడానికి రాను పోను 36 కిలోమీటర్ల దూరం తగ్గుతుందన్నారు.

ఖని కూరగాయల మార్కెట్‌లో రైతుల ఆందోళన

- హమాలీలు కూరగాయలను దొంగిలిస్తున్నారని ఆరోపణ


నిరసన తెలియజేస్తున్న రైతులు, వ్యాపారులు

కళ్యాణ్‌నగర్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మార్కెట్‌కు తీసుకువచ్చిన కూరగాయలను హమాలీలు బస్తాల నుంచి దించేటప్పుడు దొంగిలిస్తున్నారంటూ శుక్రవారం గోదావరిఖని రైతులు బైఠాయించారు. మార్కెట్‌కు తాము తీసుకువచ్చిన బస్తాల నుంచి కూరగాయలు దొంగిలించి హమాలీ కార్యాలయంలో పెట్టుకుంటున్నారని రైతులు ఆరోపించారు. హమాలీలు దాచి పెట్టిన కూరగాయాలను తీసుకువచ్చి రోడ్డుపై పారబోశారు. ఆందోళనలో మార్కెట్ కమిటీ అధ్యక్షుడు మల్లేష్, రైతులు, ఆసాములు, హోల్‌సేల్ వ్యాపారులు సదా నందం, రవీందర్, లక్ష్మయ్య, సంపత్, అనీల్, సునీల్, శ్రీను పాల్గొన్నారు.

రాజన్న ఆలయంలో భక్తుల రద్దీ


రాజన్నను దర్శించుకుంటున్న భక్తులు

వేములవాడ కల్చరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పార్వతిపరమేశ్వరులను దర్శించుకొని తరించారు. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడె మొక్కు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బద్దిపోచమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు.


కూనారం రైల్వే గేటు వద్ద నిలిచిన వాహనాలు

గేటు పడితే.. గంట ఆగాల్సిందే..

- నత్తనడకన కూనారం రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

పెద్దపల్లిటౌన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పెద్దపల్లి పట్టణంలోని కూనారం క్రాస్ రోడ్డులోగల రైల్వే క్రాసింగ్ వద్ద చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతున్నాయి. రెండేళ్లలో పనులు పూర్తి కావాల్సి ఉండగా, మరో ఏడాదైనా పనులు పూర్తయ్యే అవకాశాలు కనబడడం లేదు. ఈ రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి 2022లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 119 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరుచేశాయి. అదే ఏడాది సెప్టెంబర్‌లో పనులకు టెండర్లు దాఖలు కాగా, అదే నెలలో ఒప్పందాలు కుదిరాయి. అక్టోబరు 10న రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి భూమిపూజ చేశారు. మొదట్లో పనులు వేగంగా జరిగినా ఆ తర్వాత పనుల్లో వేగం మందగించింది. సికింద్రాబాద్-నుంచి న్యూఢిల్లీ వరకు గల అతిపెద్ద రైల్వేలైన్ పెద్దపల్లి గుండా పోతున్నది. ఈలైన్‌లో అనేక ఎక్స్‌ప్రెస్, సూపర్‌ఫాస్, ప్యాసింజర్ తో పాటు గూడ్స్ రైళ్లు నడుస్తుంటాయి. దీంతో చీటికి, మాటికి గేట్లు పడుతుండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రైల్వే గేటు పడిందంటే గంటకు పైగా వేచి చూడా ల్సిన పరిస్థితి నెలకొంది. మూడు నుంచి ఐదు రైళ్లు వెళితే గానీ గేటు తెరవకపోవడంతో ఉద్యోగస్థులు, విద్యార్థులు, రైతులు, రైతు కూలీలు, ఆటో డ్రైవర్లు సమయానికి చేరుకోక నిత్యం అవస్థలు పడు తున్నారు. 2022లో రైల్వే ఓవర్ బ్రిడ్జి పనులు మొద లైనప్పటికి ఇప్పటికి పూర్తి కాకపోవడంతో ఇబ్బం దులు ఎదురవుతున్నాయి. కూనారం రోడ్డు రైల్వే ట్రాక్ గుండా నిత్యం వేలాది వాహనాలు నడుస్తుం టాయి. దీనికి తోడు మానేరు వాగుపై గుంపుల-తనుగుల మధ్య ఒక వంతెన, హుస్సేనిమియా వాగుపై చిన్నరాతుపల్లి-పెద్దరాతుపల్లి మధ్య మరో వంతెన, కూనారం వద్ద మరో బ్రిడ్జి నిర్మించడంతో ఈ దారిగుండా వాహనాల రాకపోకల సంఖ్య పెరిగింది. మంథని వరంగల్, జమ్మికుంట, కాల్వశ్రీరాంపూర్‌లకు దూరభారం తగ్గడంతో అన్ని రకాల వాహనాలు ఈ దారిగుండా వెళ్తున్నాయి. గేటు పడిన తరువాత చాలాసేపటి వరకు తెరుచుకోకపోవడంతో పెద్ద సంఖ్యలో వాహనాలు వేచిచూడాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. దీంతో ఈదారి గుండా వెళ్లే ప్రయా ణీకులు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉన్న రోగులు, గర్భిణులు తీవ్ర అవస్థలు పడాల్సి వస్తోంది. పాఠశాలలకు, కాలే జీలకు వెళ్లే విద్యార్థులు సమయానికి చేరుకోలేక పోతున్నారు. ఉద్యోగులు సరైన సమయానికి చేరుకోక పోవడంతో గైర్హాజరు పడుతోందని వాపోతున్నారు. గ్రామాలకు నడిచే రూట్, షటిల్ బస్సులు సరైన ట్రిప్పులు వేయకపోవడం వల్ల ప్రయాణికులు ప్రైవేట్ వాహనాలను ఆశ్రయించాల్సి వస్తోంది. బ్రిడ్జి నిర్మాణం పనులు నడిచేచోట తాత్కాలిక రోడ్డు వేయక పోవడంతో గంటల తరబడి వేచిచూడాల్సి వస్తోంది. ఇప్పటికైనా బ్రిడ్జి పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

రోజులో రెండు ట్రిప్పులు పడడం లేదు..



ఎప్పుడు గేటు పడుతుండడంతో తెలియడం లేదు. రోజుకు రెండు ట్రిప్పులు పడుడే కష్టంగా మారింది. కుటుంబ ఖర్చులు వెళ్లదీయడం కష్టంగా మారింది. వెంటనే బ్రిడ్జి పనులు పూర్తిచేయాలి.

- కారుపాకల రాజేంద్ర ప్రసాద్, వెన్నంపల్లి, ఆటో డ్రైవర్

పెద్దపల్లి రావాలంటే గేటుతో ఇబ్బంది..



వ్యవసాయ పనుల అవసర నిమిత్తం పెద్దపల్లికి రావాలంటే రైల్వే గేటు తల నొప్పిగా మారింది. రోజంతా ఇటే గడిచిపోతుంది. బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరగా పూర్తయ్యేలా చూడాలి.

- దామ కనుయ్య, హన్మంతునిపేట, రైతు

కల్లు గీత కార్మికులకు అన్యాయం చేస్తే సహించేది లేదు

పాలకుర్తి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): తాతముత్తాతల నుంచి తాటి, ఈత చెట్లను నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్న కల్లు గీత కార్మికులకు అన్యాయం జరిగితే సహించేది లేదని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ అన్నారు. శుక్రవారం మండలం పరిధిలోని లక్ష్మీపురం, కన్నాల, రాణాపూర్, ఎల్కలపల్లి గేట్ గ్రామాలకు చెందిన గౌడ కుల సంఘాల నాయకులు కుటుంబసభ్యులతో కలిసి ఎన్టీపీసీ యాజమాన్యం నిర్మిస్తున్న సోలార్ ప్లాంట్, బూడిద ప్లాంట్ల వద్ద వంటావార్పు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన పుట్ట మధు, తెలంగాణ రాష్ట్ర రైతు హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లయ్యలు మాట్లాడారు. నాలుగు గ్రామాలకు చెందిన వేలాది ఈత చెట్లను ఎన్టీపీసీ యాజమాన్యం రాత్రికి రాత్రి తొలగించి గౌడ కులస్తులను కులవృత్తికి దూరం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. ఎన్టీపీసీ యాజమాన్యం తాటి ఈత చెట్లను తొలగించడం మానుకోవాలని, గీతకార్మి కులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర రైతు హక్కుల సాధన సమితి కార్యదర్శి ఎరుకల రాజయ్య, మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడు బిందె నాగభూషణం గౌడ్, సర్దార్ సర్వాయి పాపన్న గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాగిరి అంజన్ కుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



వంటావార్పు కార్యక్రమంలో మాట్లాడుతున్న పుట్ట మధూకర్

ఖనివాసులకు జాతీయస్థాయి అవార్డులు


అవార్డు అందుకుంటున్న ఎండి ఇబ్రహీం

కోల్‌సిటీటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి): న్యూఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో శుక్రవారం జరిగిన క్రాంతి జ్యోతి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకల్లో గోదావరిఖనికి చెందిన స్వచ్ఛంద సంఘాల బాధ్యులు ఈదునూరి శంకర్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆడిటర్ ఎండీ ఇబ్రహీంలు జాతీయ అవార్డులు అందుకున్నారు. ఇండియన్ గెలాక్సీ ఫౌండేషన్ న్యూఢిల్లీ, అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ అవార్డుల ప్రదానోత్సవంలో ఈదునూరి శంకర్ అంబేద్కర్ భారత్ భూషణ్ అవార్డు, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆడిటర్ ఎండి ఇబ్రహీం అంబేద్కర్ నేషనల్ ఎక్సెలెన్సీ అవార్డులను నేషనల్ కమిషన్ ఫర్ మైనార్టీస్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మెంబర్ రించన్ లామో, మాజీ కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి మీనాక్షి లేకి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

సీఎంకప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో బంగారు పతకం


సంజన

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): సీఎంకప్ రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన సంజన బంగారు పతకాన్ని సాధించింది. గత నెల 31 నుంచి ఈ నెల 2 వరకు హైదరాబాద్‌లోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో నిర్వ హించిన సీఎం కప్ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో 55 కిలోలలోపు కేటగిరిలో కరీంనగర్ జీఆర్‌ఆర్ కరాటే అకాడమీకి చెందిన సంజన పాల్గొని బంగారు పతకం సాధించిందని జీఆర్‌ఆర్ కరాటే అకాడమీ కోచ్ గౌరు రాజిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించిన సంజనను జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి వి శ్రీనివాస్‌గౌడ్, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, కోచ్ రాజిరెడ్డి అభినందించారు.

ప్రశాంతంగా సీడీపీవో పరీక్ష


అభ్యర్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

రామగిరి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో టీజీ పీఎస్‌సీ ఆధ్వర్యంలో శుక్రవారం సీడీపీవో ఉద్యోగాలకు నిర్వహించిన ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఉదయం, సాయంత్రం రెండు పేపర్లకు జరిగిన పరీక్షలో 100 మంది అభ్యర్థులకు 52 మంది హాజరైయ్యారు. అందులో 48 మంది గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రామగిరి ఎస్‌ఐ చంద్రకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. పరీక్ష రాసే అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ నిర్వహించిన అనంతరం లోనికి అనుమతించారు. పరీక్ష నిర్వహణను ప్రత్యేక అధికారిగా తహసీల్దార్ రామచందర్‌రావు పర్యవేక్షించారు.

యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా

- రీచ్ ఏర్పాటైనా నిబంధనల అమలులో జాప్యం
- జరిమానాల విధింపులో మీనమేషాలు
- సిరికొండ - తక్కళ్లపల్లి వాగులో ఇసుక మాఫియా ఇష్టారాజ్యం

కథలాపూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి-సిరికొండ పెద్దవాగులో ఇసుక మాఫియా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం రీచ్ ఏర్పాటుకు నిర్ణయించింది. సర్కారు ఆదాయానికి గండి పడుతుందనే ఉద్దేశ్యంతో మైనింగ్ అధికారులతో సర్వేలు చేయించి రీచ్ మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో అక్రమ ఇసుక రవాణాకు అడ్డు వేస్తూ పలు నిబంధనలు విధించారు. అయితే ఆ నియయ నిబంధనలు ఎక్కడా అమలు కాకపోగా తమ ఇష్టారాజ్యంగా ఇసుకను తోడేస్తున్నారు.


తక్కళ్లపల్లి వాగులో ఇసుకను తోడుతున్న అక్రమార్కులు

● నిబంధనల అమలులో జాప్యమెందుకో?

రీచ్ ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు వచ్చిన క్రమంలో ఇసుక రవాణాదారులతో రెవెన్యూ అధికారులు ప్రత్యేకంగా అవగాహనా సమావేశం ఏర్పాటు చేశారు. ఆన్‌లైన్‌లో ట్రాక్టర్ల వివరాలను నమోదు చేసుకోవాలని లబ్ధిదారులు చేసుకున్న దరఖాస్తుల మేరకు వారికి రవాణాకు అవకాశం ఇస్తామని వివరించారు. అయితే ట్రాక్టర్ యజమానులు అందుకు విముఖత చూపి పాత విధానం ప్రకారం డీడీలు చెల్లిస్తామంటూ అధికారులకు చెప్పారు. కాగా ఉన్నతాధికారులు ఆ పద్ధతికి అంగీకరించడం లేదని తెలిసింది. స్థానిక అధికారులు ఎలాంటి నిబంధనలు అమలు చేయక పోవడం వల్ల రాత్రింబవళ్లు యథేచ్ఛగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రామాల్లోని పలు ప్రదేశాల్లో ఇసుకను నిల్వచేసి నిజామాబాద్, ఆర్మూర్, మెట్‌పల్లి వంటి పట్టణాలకు టిప్పర్లు, లారీల్లో రాత్రివేళల్లో తరలిస్తున్నారు. గంబీర్‌పూర్, తాండ్ర్యాల, పోసానిపేట వాగులో ఏకంగా జేసీబీలు ఏర్పాటు చేసుకుని లారీలతో కొడిమ్యాల, రుద్రంగి, బీమారం మండలాలకు పగటి వేళల్లోనే తరలించుకు పోతున్నారు. ప్రవహిస్తున్న నీటిలో బ్లేడ్ ట్రాక్ట ర్లతో నిరంతరం తోడుతున్నా పట్టించుకునే నాథుడే కరవయ్యారు. రెవెన్యూ, పోలీసులు పది రోజుల కిందట రాత్రివేళల్లో దాడులు నిర్వహించగా ఆరు ట్రాక్టర్లను పట్టుకున్నారు. బొమ్మెనలో పలు చోట్ల నిల్వ ఉన్న డంపులను పట్టుకుని అక్క డికక్కడే టెండర్‌వేసి విక్రయించారు. పట్టుకున్న ట్రాక్టర్లను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఉంచగా నేటికీ జరిమానా విధించడంలో ఎందుకు జాప్యం జరుగుతుందనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రీచ్ నిబంధనలు పాటిస్తారా లేక పాత విధానంలో డీడీలతో ఇసుకు రవాణాకు అనుమతులు ఇస్తారా అనే విషయం చర్చనీయాంశంగా మారింది.


అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

పార్టీకి ప్రజాసంఘాలే పట్టుకొమ్మలు

భగత్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు పార్టీకి ప్రజా సంఘాలే పట్టుకొమ్మలని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి అన్నారు. నగరంలోని బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో జిల్లా కార్యవర్గ, ప్రజాసంఘాల సంయుక్త సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చాడ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సంఘాలను బలోపేతం చేసే లక్ష్యంగా పార్టీ నాయకులు పనిచేయాలని సూచించారు. సీపీఐ వందేళ్ల చరిత్రలో పేద, బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతి కోసం అనేక ఉద్యమాలు పోరాటాలు నిర్వహించి ఎన్నో విజయాలు సాధించామన్నారు. వర్గ దోపిడీకి వ్యతిరేకంగా కార్మిక, కర్షక, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం ముందుండి పోరాటాలు నిర్వహించేది సీపీఐ మాత్రమే అన్నారు. పార్టీ అభ్యున్నతి, బలోపేతం కోసం ప్రజాసంఘాల నిర్మాణం బలంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజాసంఘాల బాధ్యులు నిరంతరం శ్రమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి, జిల్లా కార్యవర్గ సభ్యుడు కొయ్యడ సృజన్‌కుమార్ నాయకులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మీ, టేకుమల్ల సమ్మయ్య, ప్రజా సంఘాల ఆఫీస్ బేరర్లు పాల్గొన్నారు



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

ఏపీవెటా ఆధ్వర్యంలో చిత్రలేఖన పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): రానున్న సంక్రాంతి సంబరాల్లో భాగంగా తెలంగాణ ఆర్ట్, ఫిజికల్, వర్క్, ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీవెటా) ఆధ్వర్యంలో సంక్రాంతి చిత్రాల సంబరాలు అనే అంశంపై చిత్రలేఖన పోటీలను ఉమ్మడి జిల్లాలో నిర్వహిస్తున్నామని ఏపీవెటా అధ్యక్షులు తాడూరి లక్ష్మీనారాయణ తెలిపారు. ఈ పోటీల్లో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు అర్హులని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేవారు ఏ4 సైజ్ పేపర్‌పై చిత్రం గీసి ఈ నెల 10వ తేదీలోపు ఏపీవెటా కార్యాలయం, ఇంటి నెం. 2-7-146, బస్టాండ్ పక్కన, కళాభారతి ఎదురుగా, కరీంనగర్ అనే చిరునామాకు నేరుగా గాని, పోస్టులో గాని పంపించాలని తెలిపారు. వివరాలకు 9849302904 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

సావిత్రీబాయి పూలే పోరాటం స్ఫూర్తిదాయకం


వేడుకలను ప్రారంభిస్తున్న సిబ్బంది

గణేశ్‌నగర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): లింగ వివక్ష, కుల అసమానతలపై సావిత్రీ బాయి పూలే పోరాటం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని శాతవాహన విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య ఉమేష్‌కుమార్ అన్నారు. సావిత్రీబాయి పూలే జయంతి వేడుకలన శాతవాహన విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్లో ప్రిన్సిపల్ డాక్టర్ మహమ్మద్ జాఫర్ అధ్యక్షతన జరిగిన వేడుకలకు ముఖ్యఅతిథిగా ఉమేష్‌కుమార్ హాజరయ్యారు. విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య వరప్రసాద్ మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు అన్ని రంగాల్లో ముందు ఉన్నారంటే అది సావిత్రీబాయి పూలే చేసిన కృషి ఫలితమేనని అన్నారు. ఆచార్య సుజాత మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, విద్య కోసం సావిత్రిబాయి పూలే తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం సమన్వయకర్త డాక్టర్ మనోహర్, విశ్వవిద్యాలయ బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ సరసిజ, ఉమెన్స్ సెల్ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, సైన్స్‌కళాశాల ప్రిన్సిపాల్ జయంతి, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ హరికాంత్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

భీమారం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న బండపల్లి అభిషేక్ సీఎం కప్ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అభిషేక్ సీఎం కప్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో 400 మీటర్ల పరుగు పందెం జూనియర్స్ క్రీడా పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జవ్వాజి అశోక్ తెలిపారు. హన్మకొండలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు పెసరి తిరుమలేశ్ తెలిపారు.

ఎంఈవోకు సన్మానం

మల్యాల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండల విద్యాధికారిగా విధులు నిర్వహించి ఇటీవలే బదిలీ అయిన అయిత శ్రీనివాస్‌ను శుక్రవారం మండల విద్యా వనరుల కేంద్రంలో ఘనంగా సత్కరించారు. మండలంలో సుదీర్ఘకాలంగా పనిచేసి కొడిమ్యాల మండలానికి బదిలీ అయిన శ్రీనివాస్ సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జయసింహారావుతో పాటు మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒలింపియాడ్ టెస్ట్‌లో ప్రతిభ

సారంగాపూర్, జనవరి, 3 (ఆంధ్రజ్యోతి) మండల స్థాయిలో శుక్రవారం నిర్వహించిన తెలంగాణ ఇంగ్లీష్ ఒలింపియాడ్ టెస్ట్‌లో మండలంలోని అర్పపల్లి జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. ఎండబెట్ల రక్షిత ఇంగ్లీష్ ఉపన్యాసంలో ప్రథమ స్థానం. అమేషబేగం ద్వితీయ స్థానం. జుజూరు వర్షిన్, వడ్లకొంగ విగ్నేస్‌లు గ్రామర్ టెస్ట్‌లో ప్రథమ ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అభినందించారు.

ప్రతీ ఒక్కరు ఇష్టంతో చదవాలి

మల్లాపూర్, జనవరి, 3 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టపడి చదివితే మంచి ఫలితాలు పొందుతారని మల్లాపూర్ ఏంఈవో దామోదర్‌రెడ్డి సూచించారు. మండలంలోని మొగిలిపేట గ్రామంలోని ఏంపీ పీఎస్ కళాశాలలో అధ్యాపక బృందంతో కలిసి నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. విద్యార్థులు చిన్ననాటి నుంచే లక్ష్యం ఏర్పరుచుకోడానికి అనుగుణంగా చదువుకోవాలన్నారు. అనంతరం పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్‌ను సంఘ నాయకులతో కలిసి ఆవిష్కరించారు.

సావిత్రిబాయి పూలే .. ఆశయసాధనకు కృషి చేయాలి

ధర్మపురి, జనవరి, 3 (ఆంధ్రజ్యోతి) సావిత్రిబాయి ఆశయ సాధనకు కృషి చేయాలని పలువురు పేర్కొన్నారు. ధర్మపురి పట్టణంలో రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ సహకారంతో మండలంలోని మహిళా ఉపాధ్యాయులను శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎంఈవో సీతలక్ష్మీ మాట్లాడారు. మగ్గిడి ఆదర్శ పాఠశాల, అంబేద్కర్ సంఘం ఆధ్వర్యంలోనూ జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తమ్మ, కౌన్సిలర్ వేముల నాగలక్ష్మీ, సంగనబట్ల సంతోషిని, పద్మ, ప్రధానోపాధ్యా యులు శ్రీనివాస్, మురళి, రాష్ట్ర కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మ్యాన పవన్‌కుమార్, సతీష్, రాజేష్, ఉపాధ్యాయ సంఘ నాయకులు గోవర్ధన్, గణేష్, శివ ప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు. మైనారిటీ బాలికల రెసిడెన్షియల్ స్కూల్‌లో కూడా వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ జ్యోతి పాల్గొన్నారు.

కొడిమ్యాల : స్త్రీల విద్యాభివృద్ధికి ఎనలేని కృషి చేసిన మహనీయురాలు సావిత్రిబాయిపూలే అని ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పేట భాస్కర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సావిత్రి బాయి పూలే జయంతిని అంబేద్కర్ యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కొత్తూరి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు ప్రసాద్, జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు రమేష్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, టీపీవైఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు నర్సయ్య, నాయకులు ఉన్నారు.

●మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మహిళా అధ్యాపకులు జయశీల, దీక్షితలను శాలువా కప్పి సన్మానించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ తిరుపతి పాల్గొన్నారు.

రాయికల్: రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని బాలికల పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను మున్సిపల్ చైర్మన్ మోర హన్మాండ్లు ఘనంగా సన్మానించారు. కౌన్సిలర్ అనురాధ, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శేఖర్, మాజీ జడ్‌సీలు మ్యాకల రమేష్, కార్యదర్శి నరేష్, క్లబ్ సభ్యులు, ప్రధానోపాధ్యాయులు పొన్నం రమేష్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రధానోపాధ్యాయులు యామీ రమణి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పూదరి నర్సయ్య, ప్రిన్సిపాల్ గంగాధర్ పాల్గొన్నారు.

●సావిత్రిబాయి పూలే జీవిత చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్పించాలని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కాయితి శంకర్ అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం దళిత సంఘాల ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. మాల మహానాడు నాయకులు నర్సయ్య, ప్రవీణ్, గోపి, మల్లేశం, బీజేపీ నాయకులు సంజీవ్, రవీందర్ పాల్గొన్నారు. అల్లీపూర్‌లో ప్రవీణ్ కుమార్, శంకర్, తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.



ధర్మపురిలో మహిళా ఉపాధ్యాయులకు సన్మానం

మల్యాల: మండల దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో మల్యాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. మ్యాక లక్ష్మన్, లక్ష్మన్, తిరుపతి, రవీందర్, సతీ ష్‌కుమార్, వెంకటస్వామి పాల్గొన్నారు.

●అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా మహిళ ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.

పెగడపల్లి : మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. ఎంఈవో సులోచన, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

కథలాపూర్ : ప్రభుత్వ జూనియర్ కళాశాల, కళా ధార పబ్లిక్ స్కూల్, గంభీర్‌పూర్ జిల్లా పరిషత్ పాఠశాలల్లో మహిళా ఉపాధ్యాయులను శాలువాలతో సన్మానించారు. కళాశాల ప్రిన్సిపాల్ నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వెల్గటూర్: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో సావిత్రిబాయి జయంతి, మహిళా ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మహిళ ఉపాధ్యాయులను శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సురేందర్, తులసి ఆగమయ్య, సంపత్ కుమార్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షురాలు సునీత, సామాజిక కార్యకర్త పొన్నం రాజమల్లయ్య, అంబేద్కర్ గ్రామ శాఖ అధ్యక్షుడు స్వామి పాల్గొన్నారు.

మల్లాపూర్ : మల్లాపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. పలు విషయాలను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

మెట్‌పల్లిటౌన్: పట్టణంలో శుక్రవారం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టులో, బామ్ సేఫ్, భార తీయ విద్యార్థి మోర్చ, ప్రభుత్వ జూనియర్ కాలేజ్‌లో, పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే విగ్రహానికి, చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళు అర్పించారు. జ్ఞానోదయ డిగ్రీ కాలేజ్‌లో మహిళ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల లింబాద్రి, టీఎస్‌యూటిఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుకొవెల శ్యాం సుందర్, శ్రీని వాస్, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు.

గొల్లపల్లి : స్థానిక ఆదర్శ పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, ప్రవీణ్, సత్తయ్య, ప్రదీప, నాగ ప్రసన్న, రజిని, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం : మండల కేంద్రంతో పాటు వర్షకొండ జడ్పీ పాఠశాలలో, గోధుర్ మాస్టర్ కాన్వెంట్ స్కూల్‌లో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి ఘనంగా నిర్వహించారు. ఆమె విగ్రహానికి పూలమాలలు వేశారు.

కోరుట్ల : పట్టణంలోని వివిధ పార్టీలు, పలు పాఠశాలలో మహిళ ఉపాధ్యాయులు కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు. బీజేపీ ఆధ్వర్యంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు రుద్ర శ్రీని వాస్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. సావిత్రి బాయి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. బీసీ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు.

జగిత్యాలరూరల్ : భారతసమాజంలో చారిత్రకమైన మార్పునకు సావిత్రబాయిపూలే పునాది వేశారని డీఈవో రాము అన్నారు. జగిత్యాల మండలం గోపాల్‌రావుపేట జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్ర వారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●అంతర్గాంలో... జగిత్యాల రూరల్ మండలంలోని అంతర్గాం జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో శుక్రవారం ఘనంగా సావిత్రబాయిపూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులను సన్మానించారు.

●జగిత్యాలరూరల్ మండలంలోని తిమ్మాపూర్ శివారులోగల సోషల్ వెల్ఫేర్ మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. ప్రిన్సిపల్ శ్రీలత, పీఈటీ హరిరామ్, వైస్‌ప్రిన్సిపల్ అమృత, బోధనసిబ్బంది పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్ : మండలంలోని మేడిపల్లి, వేంపేట గ్రామాలతో పాటు పలు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ బృందం నాగమణి, శ్రీదేవి, పద్మల త, జ్యోతి పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో సంస్థాగతమెప్పుడో..?

(5వ పేజీ తరువాయి)

అధికారం కోల్పోయి ఏడాది కావస్తున్నప్పటికీ పార్టీ సంస్థాగత బలోపేతంపై దృష్టి సారించ లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. పార్టీ కమిటీలతో పాటు అనుబంధ కమిటీలను వేస్తే.. అధిష్ఠానం ప్రజా సమస్యలపై ఇచ్చే ఏ కార్యక్రమం అయినా విజయవంతం అవుతుందన్న అభిప్రాయాలున్నాయి. ఇప్పటివరకు జిల్లా స్థాయి పూర్తి కమిటీలు, అనుబంధ కమిటీలు లేవు. కేవలం అధ్యక్షుడిని మాత్రమే నియమించారు. కోరుట్ల మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. జిల్లా కమిటీలో పూర్తి కార్యవర్గం కానీ, అనుబంధ కమిటీల నియామకం జరగడం లేదు. దీంతో జిల్లాలో యాక్టీవ్‌గా పని చేస్తున్న కేడర్ నిరాశకు గురవుతున్నారు.

●కమిటీలపై గులాబీ తమ్ముళ్ల నిరాశ...

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయం నుంచి పార్టీలోనే పని చేస్తున్నామని, పలువురు నాయకులు అవకాశాల కోసం ఎదురుచూస్తున్నారు. ఒకసారి కాక పోయినా ఇంకోసారైనా అవకాశం వస్తుందని ఆశిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో కమిటీల్లో చోటు దక్కుతుందని, జిల్లా కమిటీల్లోనూ అవకాశం వస్తుందని ఆశిస్తున్నారు. కానీ అసలు కమిటీల వేయడానికి పార్టీ అధిష్ఠానం చర్యలు చేపట్టకపోవడంతో నైరాశ్యంలో కొట్టుమిట్టాడుతున్నారు. త్వరలో కమిటీలు వేస్తామని, యాక్టివ్‌గా పనిచేసేవారికి అవకాశం ఇస్తామని, పనిచేసే ప్రతి ఒక్కరిని పార్టీ గుర్తింపు ఇస్తుందని తరుచుగా పేర్కొంటున్నా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదన్న అభిప్రాయాలు బీఆర్ఎస్ వర్గాల్లో వినిపిస్తున్నాయి.

●గుర్తింపులేదంటూ ఆవేదన..

బీఆర్ఎస్ పార్టీకి నాయకులు, కేడర్ ఉంది. యాక్టివ్‌గా పనిచేసేవారు ఉన్నారు. పార్టీ ఇచ్చే ప్రతి కార్యక్రమంలో భాగస్వాములవ్వడంతో పాటు విజయవం తానికి కృషి చేస్తున్నారు. కానీ వారికి పార్టీలో కష్టానికి సముచిత స్థానం దక్కడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఏళ్లుగా పార్టీలో పని చేస్తున్నప్పటికీ ఇతర పార్టీల్లో నుంచి వలస వచ్చిన వారికి ప్రాధాన్యం ఇస్తున్నారని, తమను విస్మరిస్తున్నారని పలువురు పార్టీ నేతలే బహిరంగంగా అభిప్రాయపడుతున్నారు.

●స్థానిక ఎన్నికలు దగ్గర పడుతున్నా...

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయినప్పటికీ హామీలు, గ్యారెంటీలను పూర్తి స్థాయిలో అమలు చేయడంలో కొంత జాప్యం జరుగుతుంది. ఈ జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు గడువు సమీపిస్తున్న పార్టీ సంస్థాగతంపై అధిష్ఠానం ఫోకస్ పెట్టడం లేదు.

మంత్రిని కలిసిన ఏఎంసీ వైస్ చైర్మన్

గొల్లపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ వైస్ చైర్మన్ పురపాటి రాజిరెడ్డి హైదరాబాద్‌లో వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి శుక్రవారం కలిశారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ మంత్రికి బొకే అందించారు. రైతుభరోసా పథకాన్ని వెంటనే అమలు చేసి యాసంగి పంట పెట్టుబడులకు రైతులకు సహకరించాలని మంత్రికి విజ్ఞప్తి చేయగా సానుకూలంగా స్పందించినట్లు వైస్ చైర్మన్ పేర్కొన్నారు. తనకు అవకాశం కల్పించిన ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్‌కు, మంత్రికి రాజిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

అధికారులు సమయ పాలన పాటించాలి

●ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి ●కలెక్టర్ బి.సత్యప్రసాద్

మెట్‌పల్లిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : అధికారులు అందరు తప్పనిసరిగా సమయ పాలన పాటించాలని కలెక్టర్ బి. సత్యప్రసాద్ సూచించారు. శుక్రవారం ఆయన మెట్‌పల్లి రెవెన్యూ డివిజన్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డు గదులను పరిసరాలను పరిశీలించారు. ఉద్యోగులు ఎంతమంది ఉన్నారు అని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కోర్టు కేసు ధరణి దరఖాస్తులను పరిశీలించారు. ఆర్డీవో కార్యాలయానికి వచ్చే అన్ని ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలన్నారు. కార్యాలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, అధికారులు ఉన్నారు.

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో శుక్రవారం కలెక్టర్ బి.సత్యప్రసాద్ పర్యటించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని పలు వార్డులలో ఇళ్ల లేని నిరుపేదలు సమర్పించిన దరఖాస్తుల ఆధారంగా సర్వే సిబ్బంది చే స్తున్న ఇంటింటి సర్వేను తనిఖీ చేశారు.

ఇందిరమ్మ పథకం కింద పూర్తిస్థాయి అర్హత గల నిరుపే దలను గుర్తించి ఇళ్ల మంజూరు చేస్తామన్నారు. త్వరితగతిన సర్వేను పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అమ్మక్కపేటలో నర్సరీని పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీనివాస్, డీపీవో రఘువరన్, తహశీల్దార్ ప్రసాద్, ఎంపీడీవో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్డీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

చెరువుల్లో మురుగు నీరు చేరకుండా చర్యలు

జగిత్యాల అర్బన్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) జగిత్యాల పట్టణంలో చెరువుల్లో మురుగు నీరు చేరకుండా 5.60 కోట్ల నిధులతో ఎఫ్‌టిపిలు ఏర్పాటు చుస్తున్నామని, వీటి ఏర్పాటుకు నిధులు మంజూరు అయ్యాయని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు.

శుక్రవారం పట్టణంలోని 16వ వార్డులో 20 లక్షల నిధులతో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు భూమి పూజ చేసిన ఆయన మాట్లాడుతూ జగిత్యాల పట్టణ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నామన్నారు. నిజమాబాద్ ఎంపీ అర్వింద్ సహకారంతో పట్టణంలో కృషి విజ్ఞాన కేంద్రం, ఏకలవ్య పాఠశాల ఏర్పాటు చేస్తున్నామన్నారు.

● మహిళల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం జమాతే ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమాతే ఇస్లామి హింద్ సేవలను కొనియాడారు. మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీతో వారికి ఆర్థిక పరిపుష్టి జరుగుతుందన్నారు. ఆయా కార్యాక్రమాలలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి,మున్సిపల్ కమిషనర్ చిరంజీవి, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్‌లు కూతురు రాజేష్, కూసరి అనిల్, ఇమాద్ ఉద్దీన్, షోయబ్ ఉల్ హక్, పాల్గొన్నారు.

అనుమతులు లేకుండా ఆస్పత్రులు నిర్వహిస్తే చర్యలు

డీఎంహెచ్‌వో ప్రమోద్

మెట్‌పల్లిటౌన్, జనవరి 3(ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా అనుపత్రులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని డిఎంహెచ్‌వో ప్రమోద్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని కేశవ ఆసుపత్రిలో ఆయన ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఆసుపత్రిలో ల్యాబ్, వైద్యుల సర్టిఫికేట్‌లు, ధరల పట్టిక, ఫైర్ సేఫ్టీ, పోల్యూషన్, బెడ్‌లు తదితర వాటిని పరిశీలించారు. అనుపత్రిలో అనుమతులకు మించి బెడ్‌లు వినియోగిస్తున్నాట్లు గుర్తించారు. అనుమతులు లేకుంగా మరో బిల్డింగ్‌లో రోగులకు చికిత్స అందిస్తూ ఆదనంగా అడ్మిషన్ బెడ్‌లు వాడుతున్నట్లు తనిఖీలలో గుర్తించారు. అనుపత్రి నిర్వహకులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్ర మంలో డిఎవో ఎ.శ్రీనివాస్, జిల్లా వైద్యా సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక మండలం ఏర్పాటు చేయాలి

మెట్‌పల్లి ఆర్డీవోకు వినతిపత్రం అందజేత

మల్లాపూర్, జనవరి, 3 (ఆంధ్రజ్యోతి) : మల్లాపూర్ మండలంలోని పలు గ్రామాలను కలుపుతూ ప్రత్యేక మండలాన్ని ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు అధికారులను కోరారు. శుక్రవారం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్‌కు గ్రామాల్లోని నాయకులు వినతి పత్రం అందజేసి సమస్యలను వివరించారు. ప్రజల సౌలభ్యం కోసం మండలంలోని కొన్ని గ్రామాలను కలుపుతూ ప్రత్యేకంగా నూతన మండలాన్ని ఏర్పాటు చేయాలని ఆర్డీవోకు వినతి పత్రం ద్వారా కోరామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సదానందాచారి, చంతామణి, పోచయ్య, శేఖర్, రాజేందర్, పాల్గొన్నారు.

ఘనంగా తిరుప్పావై సేవ

కోరుట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వేంకటేశ్వర దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలలో భాగంగా శుక్రవారం తిరుప్పావై సేవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. దేవాలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించి అభిషేక అర్చన కార్యక్రమాలను జరిపారు. దేవాలయ ఈవో విక్రం, అర్చకులు బీర్నంది నర్సింహాచారి, దేవాలయ సిబ్బంది నర్సయ్య పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పెగడపల్లి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్య పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరంగా చర్యలు తప్పవని మండల ప్రత్యేకాధికారి మనోహర్ పేర్కొన్నారు. శుక్రవారం పెగడపల్లి మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన సబ్ కీ యోజన సబ్‌కీ వికాస్‌పై అన్ని గ్రామాల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి గాను చేపట్టబోయే పనుల యాక్షన్ ప్లాన్ పొందు పరచడం తదితర అంశాల గూర్చి చర్చించారు. గ్రామాల్లో చెత్తను డంపింగ్ యార్డులకు తరలించడంలో నిర్లక్ష్యం తగదన్నారు. సమావేశంలో ఎంపీవో మహేందర్, ఏఈ శంషేర్ అలీ, ఎంఈవో సులోచన, అంగన్‌వాడీ సూపర్ వైజర్లు మహేశ్వరి, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం, సీమంతాలు

జగిత్యాలరూరల్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి):జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస సెక్టార్ పరిధిలోని జాబితాపూర్ గ్రామంలోని అంగన్ వాడీ కేంద్రంలో అక్షరాభ్యాసం, సీమంతాల కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. చిన్నారుల తల్లితండ్రులకు ముర్రుపాల విశిష్టతను ఐసీడీఎస్ సూపర్ వైజర్ రాజశ్రీ గర్భిణీలకు వివరించారు. ఈకార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జమున, స్వరూప, కళావతి, ఉమారాణి, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

ప్రాజెక్టుపై అవినీతి జరిగితే విచారణ జరిపించాలి

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

జగిత్యాల క్రైం, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) :రోళ్లవాగు ప్రాజెక్టుపై అవినీతి జరిగితే పూర్తి విచారణ జరిపించాలే తప్ప అనవసరపు ఆరోపణలు వద్దని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొ న్నారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాల యంలో శుక్రవారం కొప్పుల ఈశ్వర్ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఉమ్మడి సారంగాపూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టు ఆధునీకంరించేందుకు 2016లో అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి హరీష్ రావుల ఆధ్వర్యంలో ప్రాజెక్టు పునరుద్ధరణ పనులు చేపట్టాలని నిర్ణయించామన్నారు. ఒక టీఎంసీ వరకు ప్రాజెక్టు సామర్థ్యాన్ని పెంచడంతో 17 వేల ఏకరాల కొత్త ఆయకట్టుకు సాగు నీరును అందించామని గుర్తు చేశారు. జగిత్యాల, ధర్మపురి నియోజకవర్గాల్లో 14 లిఫ్టులు ఏర్పాటు చేసి లక్ష ఎకరాలకు సాగు నీరందించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. గతంలో 40 ఏళ్ల అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఈ ప్రాంత రైతులకు సాగు నీరు అందించలేదని మండిపడ్డారు. ప్రాజెక్టు వ్యయం పెరుగడంతో పాటు నిర్మాణ క్రమంలో భారీ వర్షాలతో పనులకు జాప్యం జరిగిందని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన ఏడాది అనంతరం రోళ్లవాగు ప్రాజెక్టు గుర్తుకు వచ్చిందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులకు చిత్తశుద్ధి ఉంటే గోదావరి నీటిని తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ శ్రీకాంత్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత, నాయకులు సత్యంరావు, మాధవరావు, రాజు, గంగారెడ్డి, వెంకటేశ్వర్ రావు. ప్రసాద్, గంగారెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్, పక్కన దావ వసంత, ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి

'కల్యాణ మండపం అభివృద్ధి పనులకు అనుమతివ్వండి'

కోరుట్ల, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయిలాపూర్ రోడ్డులో నిర్మించిన కల్యాణ భవన అభివృద్ధి పనులకు అనుమతి అందించాల ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు సంబంధిత తిరుమల తిరుపతి దేవాలయ అధికారులను కలిసి వినతులను అందించారు. శుక్రవారం దేవాలయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వై. నాగరాజు, అసిస్టెంట్ ఇంజనీర్ నాగరాజులను జువ్వాడి కృష్ణారావు కలిసి కోరారు. కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు విజ్ఞపి మేరకు టీటీడీ దేవస్థానం నుంచి నిధుల ముంజూరయ్యాయని, దేవాదాయ శాఖ అనుమతులు లభించాలని కోరారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

ధర్మపురి, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ధర్మపురి మండలంలోని మగ్గిడి ఆదర్శ కళాశాల విద్యార్థి భూక్యా శ్రావణి కౌశ పతకం గెలుచుకుంది. మొత్తం 260 కేజీల బరువు నెత్తి కౌశ పతకం గెలుపొందారు. సీఎం కప్ టోర్నమెంట్‌లో బాగంగా శ్రావణి 52 కేజీల విభాగంలో పవర్ లిఫ్టింగ్ చాంపియన్షిప్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటింది. డిసెంబరు 30 నుంచి జనవరి 2 వరకు హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో నిర్వహించిన పోటీల్లో ఆమె ప్రతిభ కనబరచి కౌశ పతకం సాదించింది. విద్యార్థి శ్రావణిని ప్రిన్సిపాల్ పద్మ వైస్ ప్రిన్సిపాల్ మహేష్, ఫిజికల్ డైరక్టర్ రాజేందర్, అధ్యాపకులు అభినందించారు.

జాతర బ్రహ్మోత్సవాల బహిరంగ వేలం టెండర్లు

బీర్‌పూర్, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ లక్ష్మీనరసింహ స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 7 నుంచి 19వ తేది వరకు అత్యంత వైభవంగా జరుగనున్నాయి. జాతరలో పలు రకాల సామగ్రి విక్రయించడం కోసం గురువారం బహిరంగ వేలం టెండర్లు నిర్వహించారు. ఈ టెండర్లలో కొబ్బరికాయలు విక్రయించడం, బెల్లం కోసం రూపాయలు 2 లక్షల 45 వేలు, లడ్డూ, పులిహోరా విక్రయించడం కోసం రూ.4 లక్షలు, పట్టినామాలు కోరమీసాలు విక్రయించడం కోసం 2 లక్షల 86 వేలు, కొబ్బరి ముక్కలు పోగు చేసుకొని విక్రయించడం కోసం 46 వేలు, తలనీలాలు పోగుచేసుకొని విక్రయించడం కోసం 11 వేలు బహిరంగ వేలం ద్వారా టెండర్లను దక్కించుకున్నారు. గండదీపం నూనె విక్రయించడానికి టెండర్‌లో పాల్గొనేందుకు ఎవరు ముందుకు రాకపోవడంతో వేలం నిలిపి వేశారు. గత యేడాది కంటే ఈ యేడు బహిరంగ వేలం ద్వారా ఆదాయం అధికంగా వచ్చినట్లు ఆలయ ఈవో సంకుటాల శ్రీనివాస్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ రాంచందర్ రావ్, మాజీ ఎంపీపీ మసర్తి రమేష్, మాజీ జడ్పీటీసీ పాత పద్మ రమేష్, మాజీ సర్పంచ్ గర్వ కుర్తి శిల్పా రమేష్, ఆలయ మాజీ చైర్మన్లు సుమన్, సామ్రాట్, రమణరావు, సొసైటీ డైరెక్టర్ కృష్ణారావు, అర్చకులు, పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక

మల్యాల, జనవరి 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఒలంపియాడ్ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఇంగ్లీష్ లాంగ్వేజ్ టీచర్స్ అసోసియోషన్ తెలంగాణ మల్యాల మండల శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మల్యాలలో జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఒలంపియాడ్ పరీక్షలు నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఇందులో పాల్గొనగా వక్తృత్వ పోటీలలో సీహెచ్ సాత్విక, పి.లహరి, బి.గ్రేష్మిక, ఒలంపియాడ్ పరీ క్షలలో డి.హర్షిక, ఎలక్యూషన్‌లో కె.వైష్ణవి, బి.రఘు ప్రథమ స్థానంలో నిలిచి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ప్రశంసా పత్రాలు అంద జేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి జయసింహారావు, గురుకుల ప్రిన్సిపాల్ మానస, నాగభూషణం, శ్రీనివాస్, కాజల్, మల్లయ్య, రమేశ్, రాజ్‌కుమార్, భాస్క రొడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా..

రాయికల్: జగిత్యాల జిల్లాకు నవోదయ స్కూల్ మంజూరు చేయడంతో పాటు పీఎం కిసాన్ సమ్మాన్ యోజన నిధి కింద సంవత్సరానికి రూ.వెయ్యి పెంచడం పట్ల మండలంలోని అల్లీపూర్ గ్రామంలో బీజేపీ నాయకులు శుక్రవారం ప్రధాని మోడీ, ఎంపీ ధర్మపురి అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రాజగోపాల్, రాజశేఖర్, రాజేందర్, పాల్గొన్నారు.

కోరుట్ల : పట్టణంలోని కటకం సంఘయ్య కల్యాణ భవనంలో నిర్వహించే అబాకస్ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని వరల్డ్ అబాకస్ టీచర్ గంగాధర్ కోరారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గంగాధర్ మాట్లాడారు. జనవరి 5వ తేదీన ఉదయం 9:30 గంట నుంచి 11:30 వరకు రెండు బ్యాచ్‌లలో నిర్వ హిస్తున్నట్లు తెలిపారు.

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, పోసానిపేట గ్రామాల్లో శుక్రవారం ఏఈఓలు మౌనిక, సుష్మశ్రీ, సంధ్యారాణి మొక్కజొన్న, వరి, వేరుశనగ పంటలను పరిశీలించారు. ప్రస్తుతం వరిలో కాండం తొలుచు పురుగు, జింకు లోపం ఏర్పడడానికి అవకాశం ఉందని అందుకు రైతులు ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కోరుట్ల: నోములు, పూజలు, వ్రతాల సమయంలో అందించే ప్రసాదాలతోనే పరమాత్ముడి అనుగ్రహం నిక్షిప్తమై ఉంటుందని శృంగేరి శారదా పీఠం పౌరాణిక ప్రవర, ప్రవచన చక్రవర్తి శృంగేరి శారాద పీఠం పౌరాణికులు బ్రహ్మశ్రీ డాక్టర్ గర్రెపల్లి మహేశ్వర శర్మ అన్నారు. పట్టణంలోని సనాతన ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో వాసవ కళ్యాణ భవనంలో అష్టాదశ పురాణ ప్రవచన జ్ఞాన యజ్ఞం శుక్రవారం కొనసాగింది.

రాయికల్: పట్టణంలోని ప్రగతి విద్యాలయంలో శుక్రవారం రాయికల్ ప్రెస్‌క్లబ్ (జేఏసీ) ఆధ్వర్యంలో అర్చన ఐకేర్ రాయికల్ సౌజన్యంతో విద్యార్థులకు ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. నేత్ర వైద్యులు సుమన్, పర్వేజ్, పాఠశాల ప్రిన్సిపాల్ బాలె శేఖర్, డైరెక్టర్ బాలె నిఖిల్ కుమార్, ప్రెస్ క్లబ్ జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

బీర్‌పూర్: బీజేపీ మహిళ మోర్చా అధ్యక్షురాలు గర్వకుర్తి శిల్పా రమేష్ ఆధ్వర్యంలో శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు.